సాక్షి వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం | 5 | జనవరి | 2025



వైభవం..ఉరుసు మహోత్సవం

మండలం లోని మాచుపల్లె గ్రామ సమీపం లో వెలసినహజరత్ సయ్యద్ షావలి దర్గాలో శనివారం రాత్రి ఉరుసు మహోత్సవాన్ని దర్గా కమిటీ ముజావర్ సయ్యద్ సలావుద్దీన్ వైభవంగా నిర్వహించారు. హిందూ, ముస్లింలు దర్గాలో ప్రార్థనలు చేశారు. బెంగళూరుకు చెందిన జమీర్ షహ్‌జాదా , హైదరాబాద్‌కు చెందిన రజియాతాజ్ ఖవ్వాలీ బృందాల మధ్య పోటీ జరిగింది. ఆదివారం తెల్లవారు జామున తహలీల్ ఫాతేహా నిర్వహించనున్నారు. -సిద్దవటం

న్యూస్‌రీల్

మహిళా డిగ్రీ కళాశాలలో సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం

వైవీయూ: కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్' సర్టిఫికెట్ కోర్సు ప్రారంభించారు. గణితశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి.గురివిరెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.సలీంబాషా మాట్లాడారు. డిగ్రీతోపాటు అనలైటికల్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ ఎంతో ముఖ్యమన్నారు. ఈ కోర్సు చేయడం ద్వారా నైపుణ్యాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్ బి.స్వరూప, అధ్యాపకులు కె.శాలిని, డి.మాల్యాద్రి, విద్యార్థినులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో విచారణ

ప్రొద్దుటూరు క్రైం: ప్రొద్దుటూరులోని జిల్లా ఆస్పత్రి పీపీ యూనిట్‌లో కడప రిమ్స్ బృందం విచారణ చేపట్టింది. పీపీ యూనిట్ వైద్యురాలు ఇళయరాణి నిర్లక్ష్యంతో తన పేగుకు రంధ్రం పడిందని చాపాడు మండలంలోని నక్కలదిన్నె గ్రామానికి చెందిన శివలక్ష్మి ఆరోపణలు చేసిన నేపథ్యంలో రిమ్స్ వైద్యులు శనివారం విచారణ చేశారు. శివలక్ష్మితోపాటు డాక్టర్ ఇళయరాణితో మాట్లాడి, వారి వాదనాలు విని రికార్డు చేసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు వైద్యులు చెప్పారు. కాగా బాధితులు వైద్యురాలితో మాట్లాడారు. శస్త్రచికిత్స జరిగిన తర్వాత ఒక రోజు ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలో ఉండాల్సి ఉండగా.. ఎందుకు అదే రోజు పంపించారని వైద్యురాలిని ప్రశ్నించారు. వైద్యురాలిపై చర్యలు తీసుకోవాలని, ప్రైవేట్ స్కానింగ్ సెంటర్ లైసెన్స్‌ను రద్దు చేయాలని వారు డిమాండు చేశారు.

మైనార్టీల ఉచిత శిక్షణకు ఆహ్వానం

కడప రూరల్: వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాలకు సంబంధించిన మైనార్టీ యువత నైపుణ్యాభివృద్ధి ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మైనారిటీ వర్గానికి చెందిన ముస్లిం, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, పార్సీలు, జైనులు తమ వివరాలను సీడాప్.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. దరఖాస్తుతోపాటు సంబంధిత జిరాక్స్ పత్రాలను కార్యనిర్వాహక సంచాలకులు, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్, డీ బ్లాక్, న్యూ కలెక్టరేట్, కడప అనే చిరునామాలో సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 08562–241137ను సంప్రదించాలని వివరించారు.

మహిళల హక్కులపై అవగాహన అవసరం

వైవీయూ: మహిళల హక్కుల రక్షణపై అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శాంత పేర్కొన్నారు. శనివారం కడప నగరంలోని శ్రీవివేకానంద మహిళా డిగ్రీ కళాశాలలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 'పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లీగల్ సర్వీస్ అథారిటీ చట్టం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, ఉచిత న్యాయసహాయం, లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ గురించి వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.మనోహర్, కళాశాల కరస్పాండెంట్ డి.ఎస్.ఆర్.మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ ఎస్.పి.మధుసూదన్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు



కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

కడప అర్బన్: పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాకు సంబంధించిన కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు కడప నగర శివార్లలోని జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం (డి.టి.సి)లో దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. ఐదో రోజైన శనివారం జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు పర్యవేక్షించారు. 600 మంది అభ్యర్థులకు గాను 373 మంది పరీక్షలకు హాజరయ్యారు. 229 మంది అర్హత సాధించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్‌బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ బి.రమణయ్య, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఐటీకోర్ టీం, డీపీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మంత్రి జనార్దన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తున్న పనులు (ఫైల్)

» రాజంపేట నియోజకవర్గం ఒంటిమిట్ట మండలం సాలబార్ క్రాస్ రోడ్డు మరమ్మతు పనులు జిల్లా ఇన్‌చార్జి మంత్రి జనార్దన్‌రెడ్డి చేతుల మీదుగా ఆర్భాటంగా ప్రారంభించారు. నెల రోజులకే తారు లేచిపోయి తిరిగి గోతులు ఏర్పడ్డాయి. రాష్ట్ర మంత్రి, అధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు, ముఖ్య నేతలంతా పాల్గొని ప్రారంభించిన ప్యాచ్ వర్క్‌ల్లోనే నాణ్యత లేకపోతే.. ఇతర ప్రాంతాల్లో వేసిన రోడ్లు ఏ మేరకు ఉంటాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



నెల రోజులకే తారు లేచి గోతులమయంగా మారిన రోడ్డు

» మదనపల్లె నియోజకవర్గంలోని రామసముద్రం, నిమ్మనపల్లె మండలాల పరిధిల్లో చేపట్టిన బీటీ రోడ్ల ప్యాచ్ వర్కులు చాలా వరకు ప్రారంభానికి నోచుకోలేదు. రూ.60 లక్షలతో 13 పనులను చేపడుతున్నారు. వాటిల్లో కూడా రోడ్లపై పడ్డ గోతులకు కంకర వేశారే తప్ప తారు వేయలేదు. ఫలితంగా కంకర రోడ్లపైకి వచ్చి ప్రమాదాలకు దారితీస్తున్నాయి.

పైపై పూత.. నిధుల మేత

మరమ్మతులు చేసినట్లుండాలి.. కానీ పనులు చేయకూడదు.. తారు కలిపామా? లేదా అన్నట్లుండాలి. పైపై పూత పూయాలి కానీ నాణ్యతగా చేపట్టకూడదు. బిల్లులు మంజూరు అయ్యే వరకు ఉంటే చాలు.. ఇదీ కూటమి నేతలు, కాంట్రాక్టర్ల వ్యూహం. నాగరికతకు చిహ్నం అయిన రహదారుల మరమ్మతుల్లో నాణ్యత నలిగిపోగా.. కూటమి నేతలు, కాంట్రాక్టర్ల అవినీతి, అధికారుల నిర్లక్ష్యం తాండవిస్తోంది. ఓ వైపు రోడ్లపై గుంతలు పూడ్చుతుండగా.. మరో వైపు మళ్లీ గోతులు పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది.



ఓబులవారిపల్లె మండలం గాదెల మార్గంలో రోడ్డు మరమ్మతు పనులు చేపట్టిన రెండు నెలలకే కంకర తేలి ఏర్పడిన గుంతలు

- నాసిరకంగా రోడ్ల మరమ్మతు పనులు
- రూ.కోట్లలో బిల్లులు స్వాహా
- కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభం
- అధిక రోడ్లలో దర్శనమిస్తున్న గుంతలు
- వాహనదారులకు తప్పని ఇక్కట్లు
- దుమ్మెత్తి పోస్తున్న ప్రజలు

రాయచోటి: గ్రామీణ, ప్రధాన రహదారుల మరమ్మతు పనులను ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దెబ్బతిన్న రోడ్లకు కంకర, తారుతో ప్యాచ్ వర్క్‌లు చేయాలని శ్రీకారం చుట్టింది. ఇందుకోసం ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాకు కోట్ల రూపాయలను కేటాయించింది. సంక్రాంతిలోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించింది. అయితే నేటికి 50 శాతం కూడా పూర్తి కాలేదని అధికారులు చెబుతున్నారు. కంకర, తారుతో కప్పిన గోతుల పరిస్థితి మళ్లీ మొదటికి వస్తోంది. ప్రభుత్వ ఆదేశాలే అవకాశంగా నాయకులు పనులు దక్కించుకున్నారు. మరమ్మతు పనుల్లో నాణ్యతకు తిలోదకాలిచ్చి పూర్తి చేయించారనే ఆరోపణలు ఉన్నాయి. అన్నమయ్య జిల్లాలో ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో 1278 కిలోమీటర్లు, పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో 3 వేల కిలోమీటర్ల మేర బీటీ రోడ్లపై పడ్డ గోతులను పూడ్చేందుకు జిల్లా కలెక్టర్ గతేడాది ఆగస్టులో పాలనా అనుమతులను ఇచ్చారు.



ప్రజాధనం వృథా

వేసిన నెల, రెండు నెలల్లోపే ప్యాచ్‌లు పాడైపోతున్నాయి. గ్రామీణ, ప్రధాన రహదారులు తిరిగి అధ్వానంగా తయారయ్యాయి. మొక్కుబడిగా మరమ్మతులు చేపట్టిన కాంట్రాక్టర్లు మాత్రం బిల్లులను దండుకున్నారు. మరమ్మతు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో ఉపయోగం లేకుండా పోయింది. దీంతో కోట్ల రూపాయల ప్రజా ధనం వృథా అవుతోంది. అలాగే ప్రజలు తిరిగి ప్రయాణ కష్టాలు భరించాల్సి వస్తోంది.

» రైల్వేకోడూరు నియోజకవర్గ పరిధిలోని ఓబులవారిపల్లె రైల్వేస్టేషన్ నుంచి గాదెలకు వెళ్లే బీటీ రోడ్డు దెబ్బతిని వాహనదారులకు, ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. ప్రభుత్వం ఈ రహదారిలోని గోతులను పూడ్చి తారు వేయడానికి అనుమతి ఇచ్చింది. ఈ బీటీ రోడ్డుపై కంకర వేసి తారు వేసి బిల్లులను కూడా పొందారు. ఇలా వేసిన రోడ్డు రెండు నెలలు గడవక మునుపే గుంతలపై వేసిన తారు తొలగిపోవడంతో.. తిరిగి గోతులమయంగా మారి ప్రయాణికులను వెక్కిరిస్తోంది. ఒక్క రైల్వేకోడూరు నియోజకవర్గంలో ప్యాచ్ వర్కులు, జంగిల్ క్లియరెన్స్ కోసం ఒక కోటి 58 లక్షల రూపాయలను ప్రభుత్వం ఖర్చు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

☛ ఇలా ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాలో కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా చేపట్టిన తాత్కాలిక రోడ్ల మరమ్మతు పనులు మూన్నాళ్ల ముచ్చటగా మారాయి. ఇవి కూటమి నాయకులకు ఆర్థిక వనరులుగా మారాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

» నాణ్యతకు తిలోదకాలు



చెన్నమరాజుపల్లె వద్ద కంకర లేచిపోయి కనిపిస్తున్న గుంత

ప్రొద్దుటూరు: గత ప్రభుత్వం రోడ్ల మరమ్మతులను పట్టించుకోలేదని ఆరోపిస్తూ.. ఎన్డీఏ కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు మంజూరు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రోడ్ల మరమ్మతులకు సుమారు రూ.800 కోట్లు మంజూరైనట్లు తెలుస్తోంది. ఇదే విధంగా ప్రొద్దుటూరు నియోజకవర్గానికి సంబంధించి ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాలతోపాటు మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేకంగా రోడ్ల మరమ్మతుల పనులు చేపట్టారు. కాంట్రాక్టర్లు పలు చోట్ల చేపట్టిన పనులు నాసిరకంగా ఉండటంతో పూడ్చిన చోట కంకర లేచిపోయి గుంతలు కనిపిస్తున్నాయి. గుంతలు చూసిన వారు ఔరా ఇదేమి చిత్రమని చర్చించుకుంటున్నారు. పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ శాఖల అధికారులు ఈ పనులు చేపట్టారు.



కడప-బద్వేలు ప్రధాన రహదారి సగిలేరునది వంతెనపై పడిన గోతులు

» మూన్నాళ్ల ముచ్చట

అట్లూరు: సంక్రాంతి నాటికి రోడ్లు ఎక్కడా గతుకులు ఉండకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఏ నియోజకవర్గం నుంచి రోడ్లు బాగలేవని ఫిర్యాదులు రాకూడదని చెబుతూ.. దెబ్బతిన్న చోట్ల మరమ్మతులు చేసేందుకు నిధులు కేటాయించారు. అయితే బద్వేలు నియోజకవర్గ పరిధిలోని రోడ్ల మరమ్మతులు(ప్యాచింగ్‌లు) మూన్నాళ్ల ముచ్చట అన్న చందంగా తయారయ్యాయి. కడప-బద్వేలు ప్రధాన రహదారికి అట్లూరు అటవీ ప్రాంతం నుంచి బద్వేలు మండలం నక్కలగండి వరకు లక్షల రూపాయల వ్యయంతో ఇటీవల గుంతలకు ప్యాచులు వేశారు. అయితే కనీసం సంక్రాంతి వరకు కూడా పనులు నిలవలేదు. తారు లేచిపోయి గతుకులమయంగా మారింది. దీంతో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. నేతలు మాత్రం జేబులు నింపుకొన్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



రాజుపాళెం దగ్గర రోడ్డుపై లేచిపోయిన తారు, కంకర

శోకం మిగిల్చిన సరదా

సరదాగా గడిపేందుకు ఎంతో ఉత్సాహంగా శేషాచలం వెళ్లిన ఆ యువకులకు అనుకోని సంఘటన ఎదురైంది. జీవితంలో ఎప్పుడూ చూడని కఠిన సవాలు ఎదుర్కోవాల్సి వచ్చింది. విహార యాత్ర కాస్త విషాదంగా మారింది. జలపాతం చూడాలన్న ఆశ.. వారిని చివరికి అడవిపాలు చేసింది. ప్రమాదవశాత్తూ ఒకరు మృతి చెందగా.. మిగతా ఐదుగురు దారి తప్పారు. రాత్రంతా అరణ్యంలోనే బిక్కుబిక్కుమంటూ గడపారు. చివరికి పోలీసుల రంగ ప్రవేశంతో కథ ముగిసింది.

- విహార యాత్రలో విషాదం
- జలపాతంలో దిగి ఒకరి మృతి
- రాత్రంతా ఐదుగురు అడవిలోనే..
- ఎట్టకేలకు బయటపడ్డ వైనం



దత్తసాయి మృతదేహం



అడవి నుంచి సురక్షితంగా బయటపడ్డ స్నేహితులు

రైల్వేకోడూరు అర్బన్: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన ఆరుగురు యువకులు అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు సమీపంలోని గుంజనేరు జలపాతం వద్దకు శుక్రవారం వెళ్లారు. ఈ ఘటనలో ఓ యువకుడు మృతి చెందగా.. ఐదుగురు సురక్షితంగా బయటపడ్డారు. రైల్వేకోడూరు సీఐ హేమసుందర్‌రావు, ఎస్సై నవీన్ బాబు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయం 7 గంటలకు శ్రీకాళహస్తికి చెందిన దినేష్, గిరి, కేదార్, పి.దినేష్, మోహన్, దత్తసాయి(25) అనే ఆరుగురు యువకులు విహార యాత్రకని శేషాచలానికి బయలుదేరారు. రెండు ద్విచక్ర వాహనాల్లో ట్రిబుల్స్ రైడ్‌గా అడవిలోకి వెళ్లారు. వాగేటికోన వద్ద తమ వాహనాలను పార్కింగ్ చేశారు. అక్కడి నుంచి సుమారు 5 కిలోమీటర్లు కాలినకడన వెళ్లారు. మధ్యాహ్నం వరకు అటవీ ప్రాంతంలో తిరిగారు. చివరికి గుంజనేరు జలపాతం వద్దకు చేరుకున్నారు. వారిలో ఒకరిద్దరికి తప్ప, మిగిలిన వారికి ఈత రాదు. అక్కడ సేద తీరుతూ బండపై ముగ్గురు కూర్చుని ఉండగా.. ముగ్గురు నీటిలోకి దిగారు. సరదాగా ఈతకొట్టేందుకు ప్రయత్నించారు. స్నేహితులు కేదార్, దినేష్, దత్తసాయిలు నీటిలో మునిగిపోతుండటం గమనించి .. వారిని కాపాడి పైకి తెచ్చారు. వారిలో దత్తసాయి స్పృహ కోల్పోయి, కొద్ది సేపటికి మృతి చెందాడు.

దారి తప్పి..

చీకటి పడటంతో తిరిగి వచ్చే హడావిడిలో దారి తప్పి పోయారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ లేకపోవడంతో ఎవరికి విషయం చెప్పాలో అర్థంకాక బోరున విలపించారు. అనంతరం 5 కిలోమీటర్లు వచ్చి సెల్‌టవర్ ఉన్న ప్రాంతానికి ఓ యువకుడు చేరుకుని విషయాన్ని స్నేహితులు, 108 వాహనం వారికి, పోలీసులకు చేరవేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. తామున్న లొకేషన్‌ను పోలీసులకు షేర్ చేశాడు. వెంటనే రైల్వేకోడూరు పోలీసులు, అటవీ శాఖ అధికారులు అడవిలో రెండు బృందాలుగా గాలించి అర్ధరాత్రి ఒంటి గంట సమయానికి వారిని గుర్తించారు. దత్తసాయి మృతదేహాన్ని శనివారం వేకువజామున రెండు గంటల ప్రాంతానికి కిందికి తీసుకొచ్చారు. రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం శ్రీకాళహస్తికి తరలించారు. ఎటువంటి అనుమతులు లేకుండా శేషాచలం రిజర్వ్ ఫారెస్ట్‌లోకి వెళ్లటంపై ఐదుగురు యువకులను పోలీసులు, అటవీ శాఖ అధికారులు విచారణ చేస్తున్నారు.

▶▶ డ్రమ్స్ వాయిస్తూ.. అలరిస్తూ..



శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరిగే ఏకాంత సేవలో నంది విగ్రహం వద్ద తన మిత్రులతో కలిసి దత్తసాయి రోజూ డ్రమ్స్ వాయించేవాడు. అలాగే మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలు వంటి ప్రత్యేక ఉత్సవాల్లో నాలుగు మాడ వీధుల్లో డ్రమ్స్ వాయిస్తూ భక్తులను ఆకట్టుకునేవారు. అతని మృతికి ఆలయ ఉద్యోగులు, సిబ్బంది, పూజారులు విచారం వ్యక్తం చేశారు.

▶▶ ఒక్కడే కొడుకు



మార్చురీ వద్ద విలపిస్తున్న మృతుడి తండ్రి

ఈశ్వరరెడ్డి, లత దంపతులకు ఒక కుమార్తె, కుమారుడు దత్తసాయి ఉన్నారు. కుమార్తె బీటెక్ చదువుతుండగా.. దత్తసాయి ఓపెన్ డిగ్రీ చేసి ఖాళీగా ఉంటున్నాడు. ఒక్కగానొక్క కుమారుడు దూరమవడంతో వారు కన్నీరుమున్నీరుగా విలపించడం చూపరులను కలచివేసింది.

ఇంటర్ విద్యార్థులకూ మధ్యాహ్న భోజనం

మైదుకూరు: ప్రభుత్వం ఇంటర్మీడియెట్ విద్యార్థులకూ మధ్యాహ్న భోజనం అమలు చేసిందని జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. జిల్లాలో ఈ పథకాన్ని మైదుకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలలో కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం కళాశాలలో వసతులు, విద్యార్థుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్, తహసీల్దారు రాజసింహా నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే, విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ శ్రీధర్

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

చాపాడు: ప్రభుత్వ పరమైన భూ సమస్యలను 45 రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. మండలంలోని బద్రిపల్లె గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు ముఖ్య అతిథులుగా కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ విచ్చేశారు. ఈ సందర్భంగా భూ సమస్యలు కలిగిన రైతులు కలెక్టర్‌కు పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత, బంధువర్గ, ఇరుగుపొరుగు సంబంధిత భూ సమస్యలు అధికంగా వస్తున్నాయని తెలిపారు. వీటిని బాధితులు కోర్టుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. చుక్కల భూములు, ఇనాం భూములు సంబంధించిన భూ సమస్యలపై తమ గ్రామాల్లో ఉండే రెవెన్యూ సిబ్బందికి ఫిర్యాదు చేస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్డీఓ సాయిశ్రీ, తహసీల్దారు రమాకుమారి, ఎంపీడీఓ వీరకిషోర్, డీటీ కృష్ణారెడ్డి, సర్పంచ్ మల్లీశ్వరి, టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, కేసీ కెనాల్ పీసీ వైస్ చైర్మన్ గురివిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ మేకలబాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దూర విద్యతో ఉజ్వల భవిష్యత్తు

కడప ఎడ్యుకేషన్ : దూర విద్యతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని దూరవిద్య డైరెక్టర్ అశోక్ యాదవ్ పేర్కొన్నారు. దూర విద్య ద్వారా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, ఆంధ్రా యూనివర్సిటీ ద్వారా ఆన్‌లైన్ డిగ్రీ, ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ, ఎంబీఏ, ఎంసీఏలతోపాటు పలు రకాల కోర్సులు చేయవచ్చన్నారు. ఈ సర్టిఫికెట్ల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు, ప్రమోషన్లకు కూడా అర్హత ఉంటుందన్నారు. దీంతోపాటు ఓపెన్ పది, ఇంటర్ కోర్సులకు నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

వంకలో దిగి పశువుల కాపరి మృతి


నీటిలో మునిగి మృతి చెందిన ముస్తఫా

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణం రోటరీ సమీపంలోని వంకలో దిగి వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కదిరి నియోజకవర్గం పట్నం గ్రామానికి చెందిన ముస్తఫా(68) రెండేళ్ల నుంచి పులివెందుల పట్టణంలోని సుబ్రహ్మణ్యం దగ్గర పశువులు మేపుకుంటుండేవాడు. రోజు మాదిరిగానే శనివారం పశువులను మేపుకునేందుకు రోటరీపురం సమీపంలోకి వెళ్లాడు. అక్కడ పశువులు వంకలోకి దిగాయని ముస్తఫా కూడా దిగాడు. అతనికి ఈత రాక మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ విష్ణు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

మద్యం మత్తులో వ్యక్తి మృతి

కడప అర్బన్ : కడప నగరంలోని ఐటీఐ సర్కిల్ వద్ద మద్యం మత్తులో ఒక వ్యక్తి మృతి చెందాడు. మృతుడు కడప రామాంజనేయపురానికి చెందిన శ్రీనివాసులు గా గుర్తించారు. కడప తాలూకా పోలీసులు దర్యాప్తు చేశారు. వ్యక్తి మద్యం అతిగా తాగి మృతి చెందాడా. మరి ఇంకా ఏమైనా కారణాలు ఉన్నాయా అనే విషయాలపై ఆరా తీస్తున్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

సిద్దవటం : మండలంలోని పెన్నానది నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ప్రజల అవసరాలకు మాత్రమే ఉచిత ఇసుక పాలసీని అమలు చేసిందన్నారు. సిద్దవటం మండలంలోని టక్కోలు, మాచుపల్లె గ్రామాల సమీపంలోని పెన్నానది నుంచి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా కడపకు తరలిస్తున్నారని, అక్కడ రూ. 4వేల నుంచి రూ. 5 వేల వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని వారు పేర్కొంటున్నారు. అక్రమంగా ఇసుక తరలిపోతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వైవీయూ సిగలో మరో మకుటం

- ఐఎస్ఓ సర్టిఫికెట్‌లు ప్రదానం
- నాణ్యమైన విద్య, పర్యావరణం, వనరుల వినియోగం, లింగ సమానత్వ చైతన్యంలో గుర్తింపు


సర్టిఫికెట్‌లను అందుకుంటున్న వైవీయూ అధికారులు, అధ్యాపకులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయానికి ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ (ఐ.ఎస్.ఓ) ధ్రువీకరణ పత్రాలు లభించాయి. విశ్వవిద్యాలయంలో నాణ్యమైన విద్య అందిస్తున్నందుకు

ఐ.ఎస్.ఓ 21001: 2018 సర్టిఫికెట్, ఎనర్జీ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టం అమలు చేస్తున్నందుకు ఐ.ఎస్.ఓ 14001: 2015 సర్టిఫికెట్, ఎనర్జీ మేనేజ్‌మెంట్ నిర్వహణకు ఐ.ఎస్.ఓ 50001: 2018 సర్టిఫికెట్‌లు అందజేశారు. అదే విధంగా జెండర్ సెన్సిటైజేషన్ సర్టిఫికేషన్, గ్రీన్ అవార్డును హైదరాబాద్ హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సంస్థ సర్టిఫికెట్లను విడుదల చేసింది. ఆ సంస్థ సీఈఓ ఆలపాటి శివయ్య శనివారం విశ్వవిద్యాలయంలో ఈ మేరకు అధికారులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజులపాటు విద్యాలయంలోని అన్ని విభాగాలను ఆడిట్ చేసి సర్టిఫికెట్ జారీ చేశామన్నారు. నాణ్యత ప్రమాణాలలో, పరిసరాల పరిరక్షణ, ఎనర్జీ మేనేజ్‌మెంట్, ప్రత్యేకించి వేస్ట్ మేనేజ్‌మెంట్, జెండర్ సెన్సిటైజేషన్‌లలో ఆదర్శనీయంగా విశ్వవిద్యాలయం ఉందన్నారు. ఇలాంటి సంస్థకు సర్టిఫికెట్ జారీ చేయడం సంతోషంగా ఉందని, ఇదే పంథాలో మరింత ప్రభావవంతంగా పని చేయాలని సూచించారు. విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి మాట్లాడుతూ వసతి గృహాల్లో నాణ్యమైన ఆహారం అందిస్తూ ఇటీవలే ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్ అందుకున్నామని తెలిపారు. జాతీయ విద్యా విధానం అమలు, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంక్ వందలోపు పొందామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి 6 కోట్ల ప్రాజెక్టులను పొందామని, అలానే విశ్వవిద్యాలయం 52 రీసెర్చ్ స్కీములకు రూ. 3.49 కోట్లు కేటాయించిందన్నారు. ప్రఖ్యాత సంస్థలతో ఎంఓయు, విద్యార్థులకు బంగారు పతకాలు ఏర్పాటు చేశామన్నారు. దూరవిద్య ద్వారా విద్యను దగ్గరకు తీసుకువచ్చామని తెలిపారు. త్వరలోనే సీపీ బ్రౌన్ లైబ్రరీ నూతన భవన నిర్మాణాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రధాన ఆచార్యులు ఎస్. రఘునాథ రెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో బీకాం ఆనర్స్ కోర్సును ప్రవేశపెట్టామన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ముందుకెళుతున్నామన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి అంతర్జాతీయ సంస్థ గుర్తింపు లభించడం అధ్యాపకుల పరిశోధన, శ్రమ ఫలాలేనన్నారు. వైయస్సార్ ఇంజినీరింగ్ కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య బి.జయరామిరెడ్డి మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధతో శిక్షణలో ఇవ్వడం ద్వారా ఉద్యోగాలను సొంతం చేసుకుంటున్నారని తెలిపారు. ఏఐసీటీఈ ఐడియల్ ల్యాబ్‌ను త్వరలో పొందనున్నామని, రూ. 55 లక్షల నిధులు విడుదల అయ్యే అవకాశం ఉందన్నారు. ఐక్యూఏసీ సంచాలకులు డాక్టర్ సుబ్రహ్మణ్యం శర్మ విశ్వవిద్యాలయ ప్రగతి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో డీన్‌లు ఆచార్య ఏజీ దాము, ఆచార్య వై.సుబ్బరాయుడు, ఆచార్య కె. రఘుబాబు, సీఈ ఆచార్య కె.ఎస్.వి. కృష్ణారావు, ఆర్అండ్‌డీ డైరెక్టర్ ఆచార్య పి.చంద్ర ఓబులరెడ్డి, ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్, పీఎం ఉషా డైరెక్టర్ డాక్టర్ టి. చంద్రశేఖర్, ఐక్యూఏసీ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ సుభోష్ చంద్ర, సభ్యులు డాక్టర్ దాక్షాయణి, డాక్టర్ రియాజున్నీసా, పీఆర్ సెల్ డైరెక్టర్ డాక్టర్ పి.సరిత, ఉమెన్ సెల్ డైరెక్టర్ ఆచార్య పి. రమాదేవి, సభ్యులు ఆచార్య కాత్యాయని, ప్రమీలామార్గరేట్, అనుప్రసన్న, వేణి సుజాత, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రూ.16 లక్షల విలువైన ఎర్రచందనం స్వాధీనం


కారు, ఎర్రచందనం స్వాధీనం చేసుకున్న అటవీ అధికారులు

పీలేరు : కారుతోసహా రూ. 16 లక్షల విలువైన ఎర్రచందనం స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు డీఎఫ్ఓ గురుప్రభాకర్ తెలిపారు. ఆయన కథనం మేరకు శేషాచలం రిజర్వ్ అటవీ ప్రాంతం నుంచి తమిళనాడుకు ఎర్రచందనం అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో పులిచెర్ల వద్ద శనివారం తెల్లవారుజామున ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా వచ్చిన కారును అటవీ సిబ్బంది ఆపే ప్రయత్నం చేశారు. అయితే కారును వేగంగా ముందుకు నడిపి రోడ్డు పక్కన ఆపి చీకట్లో ముగ్గురు పారిపోయారు. తమిళనాడుకు చెందిన సతీష్ అనే వ్యక్తి దొరికాడు. వాహనాన్ని తనిఖీ చేయగా 320 కేజీల బరువుగల 11 ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించి కారుతో సహా స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో సిబ్బంది చంద్రశేఖర్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

మొన్నొచ్చిన రాంప్రసాద్‌రెడ్డి మంత్రి కాలేదా..!

వైరల్‌గా మారిన టీడీపీ కార్యకర్త వ్యాఖ్యలు


ఫ్లెక్సీల కోసం టీడీపీ వర్గాల వాగ్వాదం

బి.కొత్తకోట : అన్నమయ్య జిల్లా బి.కొత్తకోటలో శనివారం టీడీపీ వర్గాల మధ్య చోటుచేసుకున్న ఫ్లెక్సీ వివాదంలో ఓ కార్యకర్త.. పార్టీ మారిన రాంప్రసాద్‌రెడ్డి మంత్రే అయ్యాడు ఇక సీనియారిటీ ఏం లెక్కనా అన్న ధోరణిలో మాట్లాడిన తీరు టీడీపీలో చర్చనీయాంశమైంది. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి శనివారం బి.కొత్తకోట మీదుగా ములకలచెరువుకు వెళ్తుండటంతో టీడీపీ నేత జయచంద్రారెడ్డి వర్గీయుడు చిటికె శివారెడ్డి జ్యోతిచౌక్‌లో ఫ్లెక్సీలు కట్టిస్తుండగా.. తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జి.శంకర్ యాదవ్ వర్గీయులు దేవరింటి కుమార్, చాకన రాజా, సురేంద్ర, ప్రకాష్, శ్రీనాథ్ తదితరులు అక్కడికి చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్యే శంకర్ ఫొటోలతో పెట్టిన ఫ్లెక్సీలపై ఫ్లెక్సీ కడుతుండగా అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. మేం ఐదేళ్లు పార్టీ కోసం కష్టపడి పనిచేశామని, అప్పుడు మీరెక్కడున్నారని జయచంద్రారెడ్డి వర్గీయుడు చిటికె శివారెడ్డిని శంకర్ వర్గీయులు నిలదీశారు. దీంతో శివారెడ్డి..రాం ప్రసాద్‌రెడ్డి మొన్ననే వచ్చింది.. మంత్రి కూడా అయ్యా.. ఇప్పుడు ఆయనకే పూలహారాలు వేస్తావుండ్లా మీరు.. అని చిందులేశాడు. పోలీసులు చేరుకుని శంకర్ ఫ్లెక్సీలపై కట్టకుండా పక్కన కట్టాలని సూచించడంతో వివాదం ముగిసింది. మంత్రిపై చేసిన వ్యాఖ్యల వీడియో వైరల్ కావడంతో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి దీనిపై జయచంద్రారెడ్డిని ఆరా తీసినట్లు తెలిసింది.

యువకునిపై దాడి

మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య


గురుడు (ఫైల్)

లింగాల : లింగాల మండలం రామన్నూతనపల్లె గ్రామంలో లోమడ గురుడు(18) అనే యువకునిపై గత ఏడాది డిసెంబర్ 31వ తేదీన రాత్రి కొందరు దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడి మనస్తాపానికి గురై పురుగుల మందు తాగాడు. వెంటనే మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడని యువకుని తండ్రి లోమడ సూరుడు తెలిపారు. వివరాలిలా.. గురుడు గ్రామంలోని ఒక యువతిని ప్రేమిస్తున్నాడని, ఇది గమనించిన యువతి కుటుంబ సభ్యులు, బంధువులు డిసెంబర్ 31వ తేదీ రాత్రి గురుడుకు ఫోన్ చేసి ఇంటి వద్దకు పిలిపించారు. ప్రసాద్, గణేష్, సదా నిరంజన్, ప్రభుదేవా అనే వ్యక్తులు ఒక్కసారిగా ఇతనిపై దాడి చేశారు. తమ కుమారుడు అలాంటి వాడు కాదని, ఏ ఉద్దేశంతో దాడి చేశారో తెలియదని యువకుడి కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయమై వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

అట్లూరు : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. కడప–బద్వేలు ప్రధాన రహదారిపై అట్లూరు క్రాస్‌రోడ్డు సమీపంలో ఉన్న అటవీ చెక్‌పోస్టు వద్ద శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇసుక లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్‌ను ఆపి తనిఖీ చేశామన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా సిద్దవటం సమీపంలోని పెన్నానది నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు తేలడంతో ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించామన్నారు.

ఆరోగ్యశ్రీకి తిలోదకాలిస్తున్న చంద్రబాబు

వైఎస్సార్‌సీపీ వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి


మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలోని ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకానికి తిలోదకాలిస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం కడపలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చారని పేర్కొన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మొత్తం మూడు వేల జబ్బులను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకు రావడం ద్వారా ఆ పథకాన్ని మరింత పటిష్టం చేశారన్నారు. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ పథకాన్ని నీరుగార్చేందుకు సిద్ధపడ్డారని విమర్శించారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని నారా లోకేష్‌కు సన్నిహితులైన ఒక ప్రైవేటు బీమా కంపెనీకి అప్పగించడం ద్వారా ముడుపులు తీసుకునేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు. వైఎస్ హయాంలో ప్రవేశపెట్టిన ఈ పథకంతో చంద్రబాబు వ్యాపారం నడుపుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న టీడీపీకి ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కాల పరిమితి ముగిసిన 108 వాహనాలను తొలగించి 1080 కొత్త వాహనాలను సమకూర్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదేనని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు పూర్తయినప్పటికీ ప్రజలకు నష్టాలే తప్ప ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్‌కుమార్, కార్పొరేటర్ షఫీ, త్యాగరాజు, కిరణ్, అఖిల్, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ షఫీ పాల్గొన్నారు.

రెట్టించిన ఉత్సాహంతో సేవలందించాలి

కడప కల్చరల్ : ఇంతవరకు పార్టీకి అందించిన సేవలను గుర్తించి కార్యకర్తలకు కీలక పదవులు ఇచ్చారని, రెట్టించిన ఉత్సాహంతో సేవలు అందించాల్సిన అవసరం ఉందని నాయకులు, కార్యకర్తలు, ఆయా విభాగాల ప్రతినిధులకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీలో పలువురు కార్యకర్తల సేవలను గుర్తించి వారికి పార్టీలో కీలక బాధ్యతలు అప్పగిస్తూ నియామకాలు చేపట్టామన్నారు. బాధ్యతలు స్వీకరించిన కార్యకర్తలంతా చిత్తశుద్ధితో శక్తివంచన లేకుండా కృషి చేయాలని సూచించారు.

ఉక్కు ఫ్యాక్టరీపై కూటమి ప్రభుత్వం మౌనం వీడాలి

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్



కడప నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం శ్రేణులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై మౌనం వీడాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ అన్నారు. శనివారం సీపీఎం 12వ జిల్లా మహాసభల సందర్భంగా జియోన్ కాలేజ్ నుంచి ఐటీఐ సర్కిల్ వరకు ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విభజించి పాలించు పద్ధతిలో ప్రజల మధ్య మత వైషమ్యాలను రెచ్చగొడుతూ పబ్బం గడుపుకుంటోందన్నారు. ప్రపంచాన్ని అదానీ అవినీతి కుదిపేస్తోందని, భారత ప్రతిష్టను అమెరికాలో తాకట్టు పెట్టారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రకృతి వనరులన్నీ అదానీకి తాకట్టు పెట్టేందుకు ప్రస్తుత ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. రాష్ట్రంలో మోదానీ పాలన సాగుతోందని ఎద్దేవా చేశారు. కడప జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ శిలాఫలకాలకే పరిమితమైందన్నారు. విభజన చట్టంలోని హామీలు ఏ ఒక్కటి అమలు కాలేదని బీజేపీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఉక్కు ఫ్యాక్టరీ కడప జిల్లాలో నిర్మిస్తామని బీజేపీ ప్రభుత్వం ప్రకటించిందని కానీ ఇంతవరకు అతీగతి లేదన్నారు. ఆంధ్ర రాష్ట్రంలోని కూటమి సర్కార్ మౌనంగా ఉండడం సరి కాదన్నారు. జమిలి ఎన్నికల వల్ల ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుందని, ఖర్చులు, భారాలు ప్రజలపై పెరుగుతాయని తెలిపారు. స్మార్ట్ మీటర్లను పగలగొట్టండని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ పిలుపునిచ్చారని, టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్మార్ట్ మీటర్లను ఎందుకు బిగిస్తున్నారని ప్రశ్నించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగం నిర్లక్ష్యానికి గురవుతోందని జిల్లాలో రైతాంగం ఆత్మహత్యల పరంపరం కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు ఎ.రామ్మోహన్, బి.మనోహర్ శివకుమార్, ఐఎన్ సుబ్బమ్మ, జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, అన్వేష్, శ్రీనివాసులరెడ్డి, శ్రీనివాసులు, చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఈ డీఈఓ మాకొద్దు!

- ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా
- జేసీకి వినతిపత్రం


డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయుల, ప్రధానోపాధ్యాయుల ఆత్మాభిమానాన్ని కించపరిచేలా మాట్లాడితే ఎంతవరకైనా పోరాడతామని విద్యాశాఖను ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు హెచ్చరించారు. ఈ డీఈఓ మాకొద్దంటూ శనివారం కడప డీఈఓ కార్యాలయం ఎదుట వందల సంఖ్యలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు కదం తొక్కారు. డీఈఓ డౌన్ డౌన్.. ఈ డీఈఓ మాకొద్దంటూ నానాదాలతో డీఈఓ కార్యాలయ ఆవరణం దద్దరిల్లింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ డీఈఓగా బాధ్యతలు చేపట్టిన రెండు నెలల్లోనే ఈ విధంగా ఏ అధికారి ప్రవర్తించలేదన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించి వివిధ సమస్యలపై డీఈఓను కలిసేందుకు ప్రయత్నిస్తే సాయంత్రం 6 గంటల తరువాత ఆఫీసుకు వస్తారన్నారు. పాఠశాలల పర్యవేక్షణకు వెళ్లినప్పుడు హెచ్‌ఎం, ఉపాధ్యాయుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తారన్నారు. ఒక మహిళా ప్రధానోపాధ్యాయురాలి ముఖంపై ఉమ్మేసి దుర్భాషలాడారని ఆరోపించారు. ఎవరైనా ప్రధానోపాధ్యాయులు సెలవులో ఉంటే ఇన్‌చార్జితో వాడు ఎందుకు రాలేదు.. వాడిని పిలిపించు.. అంటూ అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆపార్ నమోదులో జిల్లాను ఐదవ స్థానంలో నిలిపినప్పటికి జిల్లా వ్యాప్తంగా 821 మంది ప్రధానోపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారన్నారు. ఉన్నతాధికారులు విచారించి ఈమెపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నా అనంతరం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఐక్యవేదిక ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పొలం వివాదంలో అన్నదమ్ములపై కత్తులతో దాడి


చికిత్స పొందుతున్న శ్రీరాములు, రవి

నిమ్మనపల్లె : పొలం వివాదం కారణంగా ఓ వర్గంలోని వ్యక్తులు అన్నదమ్ములపై కర్రలు, కత్తులతో దాడికి పాల్పడిన సంఘటన శనివారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీ దిన్నెమీద జంగంపల్లి గ్రామానికి చెందిన జి.శ్రీరాములు(50)తో స్థానికులైన హరిబాబు, రమేష్, రామానాయుడుకు పొలానికి సంబంధించి వివాదం ఉంది. అందుకు సంబంధించి కేసు కోర్టులో నడుస్తోంది. ఇటీవల సదరు పొలానికి సంబంధించి కోర్టులో శ్రీరాములు కుటుంబ సభ్యులకు అనుకూలంగా కోర్టు నిర్ణయం వెలువడింది. ఈ క్రమంలో శనివారం పొలం వద్ద శ్రీరాములు ఉండగా, హరిబాబు, సుబ్బయ్య, రమేష్, అరుణ, పవన్ ట్రాక్టర్ తీసుకుని పొలం వద్దకు వెళ్లి దున్నేందుకు ప్రయత్నించారు. ఈ విషయమై శ్రీరాములు వారిని ప్రశ్నించగా కర్రలు, కట్టెలతో దాడి చేశారు. కత్తులు, కొడవలితో నరికేందుకు ప్రయత్నించగా శ్రీరాములు చేతిని అడ్డు పెట్టడంతో తీవ్ర గాయమైంది. అక్కడినుంచి తప్పించుకుని బాధితుడు స్థానికుల సాయంతో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి చేరుకున్నాడు. అదే సమయంలో వారు గ్రామంలోకి వెళ్లి ఇంటి వద్ద ఉన్న శ్రీరాములు తమ్ముడు రవి(46) పై దాడికి పాల్పడ్డారు. అతనికి తీవ్ర గాయాలయ్యాయి.

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన సోమశేఖర్

మదనపల్లె : అనారోగ్యంతో మనస్తాపం చెంది ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం మదనపల్లె మండలంలో జరిగింది. కొత్తపల్లి పంచాయతీ కొత్త ఇండ్లు రంగారెడ్డి కాలనీకి చెందిన మదన్‌మోహన్ కుమారుడు సోమశేఖర్ (26) పట్టణంలోని సిద్ధార్థ సినిమా థియేటర్ సమీపంలోని బార్బర్ షాప్‌లో పని చేస్తున్నాడు. దీంతోపాటు బళ్లారి డ్రమ్స్ వాయిద్య ప్రదర్శనలకు వెళుతూ ఉంటాడు. గత ఏడాది వినాయక చవితి సందర్భంగా ఓ ప్రదర్శనకు వెళ్లగా, డ్రమ్స్ వాయిస్తూ ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదంలో ఒకవైపు పక్క ఎముకలు విరిగి తీవ్ర అస్వస్థతకు లోనయ్యాడు. అప్పటినుంచి పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందాడు. అయినా ఫలితం లేకపోవడంతో తీవ్ర మానసిక వేదనకు గురయ్యాడు. డ్రమ్స్ వాయించేందుకు వెళ్లలేకపోయాడు. మూడు రోజుల నుంచి పనికి వెళ్లకుండా ఇంటి వద్ద ఉంటున్నాడు. శనివారం మధ్యాహ్నం ఇంట్లోనే మరో గదిలోకి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తాలూకా ఎస్ఐ చంద్రమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బావ బావమర్దుల మధ్య ఘర్షణ

ఒకరికి కత్తిపోట్లు.. పరిస్థితి విషమం



చికిత్స పొందుతున్న మహబూబ్ బాషా

కడప అర్బన్ : కడప నగరంలోని గుర్రాల గడ్డకు చెందిన మహబూబ్‌బాషా (32)ను, అతని బావ తిలక్ నగర్ చెందిన రియాజ్ బాషా కత్తితో పొడిచి గాయపరిచాడు. మహబూబ్ బాషా చెల్లెలిని రియాజ్‌బాషా వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగేది. శుక్రవారం రియాజ్ బాషా భార్య తన పుట్టింటికి వచ్చింది. శనివారం మధ్యాహ్నం నుంచి మహబూబ్ బాషా, రియాజ్‌బాషా మద్యం తాగి ఆటోలో గుర్రాలగడ్డకు వస్తుండగా రెండో గాంధీ బొమ్మ సమీపంలోకి రాగానే ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. బుల్లెట్ ద్విచక్ర వాహనం తాళాల గురించి గొడవపడ్డారు. దీంతో రియాజ్‌బాషా కత్తితో మహబూబ్‌బాషాపై దాడి చేశాడు. తీవ్ర గాయాల పాలైన అతన్ని పోలీసులు, స్థానికులు రిమ్స్‌కు తరలించారు. అతన్ని మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. సంఘటనా స్థలానికి కడప వన్‌టౌన్ ఇన్‌చార్జి నాగార్జున, ఎస్ఐ హుస్సేన్ తో కలసి చేరుకున్నారు. పరారీలో ఉన్న నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయాల్లో అభివృద్ధి పనుల అవినీతిపై విజిలెన్స్ విచారణ

ఒంటిమిట్ట : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని పలు ఆలయాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో జరిగిన అవినీతిపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. వెంకటేశ్వర్లు అనే వ్యక్తి చేసిన ఫిర్యాదు మేరకు ఒంటిమిట్ట కోదండరామాలయంలో అభివృద్ధి పనుల్లో భాగంగా మిగిలిపోయిన ఇనుప రేకులు, ఇనుప వస్తువులు, ఇతర సామాన్లు మాయమైన సంఘటనపై టీటీడీ విజిలెన్స్ ఎస్ఐ విష్ణువర్ధన్ శనివారం విచారణ జరిపారు. అలాగే నందలూరు సౌమ్యనాథ స్వామి ఆలయం, తాళ్లపాక, దేవుని కడపలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో కూడా పనులు చేయకుండానే బిల్లులు తీసుకున్నారనే ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. సౌమ్యనాథస్వామి ఆలయ ధ్వజ స్తంభం మార్పిడి చేయకుండా మార్చినట్లుగా బిల్లులు చెల్లించారని, క్షేత్రస్థాయిలో నిర్ధారణకు వచ్చారు. రామాలయంలో ఇనుప వస్తువులను ఇంజినీరింగ్ అధికారులు తరలించారని అప్పటి కాంట్రాక్టర్లు, అధికారులను విచారించారు. తుది నివేదికను టీటీడీ విజిలెన్స్ అధికారులకు అందజేస్తానని ఎస్ఐ తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్ ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన లావణ్య

రామసముద్రం : రామసముద్రం మండలం మాలేనత్తం పంచాయతీ కొండూరు గ్రామంలో అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న లావణ్య (32) ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధితురాలి కథనం మేరకు.. అంగన్‌వాడీ సూపర్ వైజర్ చంద్రకాంతమ్మ ప్రతి చిన్న విషయానికి తనను వేధిస్తోందని, పలు మార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఆమెపై చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఆమె తెలిపారు.

సూపర్‌వైజర్‌ను సస్పెండ్ చేయాలి

రాయచోటి అర్బన్ : అంగన్‌వాడీ వర్కర్ లావణ్యను వేధింపులకు గురిచేసిన ఆ సెక్టార్ సూపర్‌వైజర్ చంద్రకాంతమ్మను వెంటనే సస్పెండ్ చేయాలని సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం రాయచోటి ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ వర్కర్లు నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి బంగారుపాప, ప్రాజెక్టు అధ్యక్షురాలు సిద్దమ్మ, అరుణ, సుమలత, సురేఖ, భూదేవి, అనిత తదితరులు పాల్గొన్నారు.